


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక




శుక్రవారం 15-05-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 334 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## ఏపీ హైకోర్టు సీజేకు జడ్ ప్లస్ భద్రత..


- గ్రీన్ ఛానల్ ఏర్పాటుకు ఆదేశాలు...
- సెక్యూరిటీ రివ్యూ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వ నిర్ణయం
- సీజే కాన్వాయ్‌కు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు
- విజయవాడ, గుంటూరు పోలీసులకు డీజీపీ నుంచి కీలక సూచనలు




## కేరళ సీఎంగా వి.డి.సతీశన్

తిరువనంతపురం,ఇది కద నిజం : కేరళ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠకు కాంగ్రెస్ అధిష్టానం ఎట్టకేలకు తెరదించింది. అసెంబ్లీ ఎన్నికల్లో యుడిఎఫ్ ఘనవిజయం సాధించిన పది రోజుల తర్వాత, ముఖ్యమంత్రి పగ్గాలను వి.డి. సతీశన్ కు అప్పగిస్తున్నట్లు ఏఐసీసీ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు దిల్లీలో జరిగిన సుదీర్ఘ చర్చల అనంతరం అధిష్టానం తన నిర్ణయాన్ని వెల్లడించింది.

ఇటీవల జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి 140 స్థానాలకు గాను 102 స్థానాలను కైవసం చేసుకుని ప్రభంజనం సృష్టించింది. దీంతో గత పదేళ్లుగా కొనసాగుతున్న ఎల్‌డిఎఫ్ పాలనకు ముగింపు పడింది.






## చిచ్చురేపుతున్న 'కేబినెట్ హోదా'

- జీతాల్లో తేడాలపై ఆవేదన
- అందరం సలహాదారులమే కదా?
- కొందరికి మంత్రి స్థాయి సౌకర్యాలు
- మాకు మాత్రం తూతూ మంత్రం!
- ప్రోటోకాల్‌లోనూ వివక్ష ఆరోపణలు
- అధికార పార్టీలో అంతర్గత అసహనం
- ఇద్దరికే కేబినెట్ హోదా
- కేకే, సుదర్శన్‌రెడ్డికి ప్రత్యేక ప్రాధాన్యం
- సలహాదారుల నియామకాలపై విమర్శలు
- ఉపాధి పునరావాసంగా మారిందా?

న్యూస్ డెస్క్, 14 మే (ఇది కద నిజం ): ప్రస్తుతం ప్రభుత్వానికి,వివిధ శాఖలకు 11 మంది సలహాదారులు ఉన్నారు. కాని ఒక్కొక్కరి జీతం ఒక్కో రకంగా ఉంది. దీనిపై తక్కువ జీతం ఉన్న అడ్వయిజరీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందరం సలహాదారులమే కదా?కొందరికి ఎక్కువ జీతం, ఇంకొందరికి తక్కువ జీతం ఎందుకు? వారికి మంత్రులతో సమానంగా ప్రొటోకాల్ ఇవ్వడం, మాకు మాత్రం తూతూ మంత్రంగా ఏర్పాట్లు చేయడం ఏంటీ?అని ఆవేధన చెందుతున్నారు. సలహాదారులు అందరికి ఒకేరకమైన జీతభత్యాలు,ప్రొటోకాల్ ఇవ్వాలంటూ సన్నిహితంగా ఉండే మంత్రులను డిమాండ్ చేస్తున్నారు.

వారికే ఎందుకు ప్రయారిటీ?

ప్రభుత్వం సలహాదారులు అందరిని ఒకే తీరుగా ట్రీట్ చేయకుండా,కొందరికి ప్రయారిటీ ఇచ్చి,మిగతా వారిపట్ల వివక్ష చూపడం ఏంటీ?అని తక్కువ జీత భత్యాలు అందుకుంటున్న సలహాదారులు ఆవేధన చెందుతున్నారు. మిగతా 2లో..

## ఆక్వా రైతుల కష్టాలపై వైఎస్ జగన్ ఆందోళన

అమరావతి,ఇది కద నిజం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల రైతులు కోలుకోలేని దెబ్బతింటున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందించిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను విస్మరించిందని విమర్శించారు.

ప్రధానంగా విద్యుత్ సబ్సిడీల తొలగింపు మరియు ఫీడ్ ధరల పెరుగుదలపై జగన్ తీవ్రంగా స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతులకు యూనిట్ రూపాయిన్నరకే విద్యుత్ అందించామని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఆ సబ్సిడీని ఎత్తేయడం వల్ల సాగు వ్యయం భారంగా మారిందని పేర్కొన్నారు. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు చెరువులను ఎండబెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఆయన ఆరోపించారు.




మార్కెట్‌లో ఆక్వా ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని జగన్ విమర్శించారు. దళారుల వ్యవస్థను అరికట్టడంలో మరియు కనీస మద్దతు ధర అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎగుమతులపై ఆధారపడిన ఈ రంగం ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్ సవాళ్లతో పాటు అంతర్గత మద్దతు లేక కుదేలవుతోందని ఆయన విశ్లేషించారు.

## బండి భగీరథ్ పోక్సో కేసులో ట్విస్ట్

న్యూస్ డెస్క్, 14 మే (ఇది కద నిజం): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. మధ్యంతర బెయిల్‌పై తీర్పును నేటికీ వాయిదా వేసింది.




## స్థానిక ఎన్నికలపై జనసేన నజర్

మంగళగిరి,ఇది కద నిజం : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ తన వ్యూహాలను సిద్ధం చేస్తోంది. మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జనసేన పొలిటికల్ అఫైర్స్ కమిటీ అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం మేరకు, రాబోయే ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన పంథాపై పీఏసీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు.




రాష్ట్రంలో పంచాయతీ, మండల పరిషత్ మరియు జిల్లా పరిషత్ ఎన్నికల ముహూర్తం సమీపిస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం సాగింది. కూటమి ప్రభుత్వంలో భాగంగా ఉన్న జనసేన, స్థానిక సంస్థల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకోవాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం జిల్లాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించి, అభ్యర్థుల ఎంపికపై ప్రాథమిక కసరత్తు ప్రారంభించాలని నిర్ణయించారు.

## కార్యదర్శులపై సీఎం అగ్రహం




అమరావతి, మే 14(ఇది కద నిజం): సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశానికి కార్యదర్శులు సకాలంలో రాకపోవడంపై ముష్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి రాని అధికారుల నుంచి వివరణ తీసుకుని సీరియస్ యాక్షన్ తీసుకోవాలని సీఎస్ను ఆదేశించారు. ఇంధన పొదుపుపై చర్చించేందుకు అధికారులు గైర్హాజరు కావడంపై సీఎం అసహనం వ్యక్తం చేశారు.

సమావేశానికి కార్యదర్శులు సకాలంలో హాజరు కాకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఏపీలో పొదుపు బాట

అమరావతి (ఇది కద నిజం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం అయ్యింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు మరియు పరిపాలనా సంస్కరణలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి, ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవాలని కేబినెట్ ఏకగ్రీవంగా నిర్ణయించింది.




రాష్ట్రం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్ల దృష్ట్యా, అనవసరపు ఖర్చులకు కళ్లెం వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో పొదుపు చర్యలు తక్షణమే అమలులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి మంత్రులకు మరియు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. బడ్జెట్ కేటాయింపులను అత్యంత పొదుపుగా, ప్రాధాన్యత క్రమంలో వాడాలని స్పష్టం చేశారు.

పరిపాలనా పరంగా చూస్తే, ప్రభుత్వ వాహనాల కొనుగోలు, విదేశీ పర్యటనలు మరియు ప్రభుత్వ కార్యాలయాల ఆధునీకరణ వంటి అంశాలపై తాత్కాలిక నియంత్రణ విధించాలని నిర్ణయించారు. అత్యవసరమైతే తప్ప కొత్త నియామకాల జోలికి వెళ్లకుండా, ఉన్న వనరులనే సమర్థవంతంగా వినియోగించుకోవాలని కేబినెట్ అభిప్రాయపడింది. దీనివల్ల ఖజానాపై పడే అదనపు భారాన్ని తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ ప్రకటనలు మరియు ప్రచార ఖర్చుల విషయంలో కూడా కీలక మార్పులు చేయనున్నారు. ఆర్భాటాలకు పోకుండా కేవలం ప్రజలకు అవసరమైన సమాచారాన్ని చేరవేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ప్రతీ రూపాయిని ప్రజల సంక్షేమం కోసం, అభివృద్ధి పనుల కోసం మాత్రమే వెచ్చించాలని సమావేశంలో మంత్రులందరూ ఏకీభవించారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 15-05-2026

# చిచ్చురేపుతున్న 'కేబినెట్ హోదా'..

మొదటి పేజీ తరువాయి

పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కష్టపడిన తమకు ప్రయారిటీ ఇవ్వకపోవడం బాధగా ఉందంటూ సన్నిహితంగా ఉండే మంత్రుల వద్ద మనస్సులోని బాధను చెప్పుకుంటున్నారు. ఎన్నికలకు ముందు ఇతర పార్టీలో ఉండి,అధికారం వచ్చిన తరువాత పార్టీలో చేరిన లీడర్లకు,కొందరు రిటైర్డ్ అధికారులకు సలహాదారు పదవులు ఇవ్వడంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సలహాదారుల్లో కూడా ఓసీ వర్గాలకు చెందిన లీడర్లకు పెద్ద పదవులు ఇచ్చి, మిగతా వర్గాలకు చెందిన వ్యక్తులకు ప్రయారిటీ ఇవ్వడం లేదని గుర్తు చేసినట్లు తెలిసింది. "ఓసీ వర్గానికి చెందిన అడ్వయిజరీకి మంత్రి తో పాటు సమాన జీతం,ప్రొటోకాల్, మాకు మాత్రం లక్షన్నరలోపు జీతం ఇస్తారా?ఇదేం న్యాయం?"అని ఓ అడ్వయిజర్ తన ఆవేధనను ఓ సీనియర్ మంత్రి వద్ద వెలిబుచ్చినట్లు తెలిసింది.

| సలహాదారు పేరు | విభాగం / సబ్జెక్ట్ |
|---|---|
| కే. కేశవరావు | పబ్లిక్ ఎఫైర్స్ (కేబినెట్ హోదా) |
| పీ. సుదర్శన్ రెడ్డి | ఫ్లాగ్ షిప్, వెల్ఫేర్ పథకాల అమలు (కేబినెట్ హోదా) |
| షబ్బీర్ అలీ | మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం |
| హర్కర వేణుగోపాల్ | ప్రొటోకాల్, పబ్లిక్ ఎఫైర్స్ |
| పోచారం శ్రీనివాస్ రెడ్డి | వ్యవసాయం |
| ఏపీ జితేందర్ రెడ్డి | క్రీడలు |
| వి. హన్మంతరావు | బీసీ సంక్షేమం |
| ఎన్వీఎస్ రెడ్డి | అర్బన్ ట్రాన్స్ పోర్టు |
| ఆదిత్యనాథ్ దాస్ | ఇరిగేషన్ |
| గోవింద హరి | ఎండోమెంట్ |
| శివధర్ రెడ్డి | సెక్యూరిటీ |

ఇద్దరికి మాత్రమే కేబినెట్ హోదా

కే.కేశవరావు(పబ్లిక్ ఎఫైర్స్),పీ.సుదర్శన్ రెడ్డి(ఫ్లాగ్ షిఫ్,వెల్ఫేర్ పథకాల అమలు)కు మాత్రమే కేబినెట్ హోదా ఇచ్చారు. వీరికి మంత్రులతో పాటు సమానంగా జీతభత్యాలు,ప్రోటోకాల్ సౌకర్యం ఉంటుంది. ఆ ఇద్దరికి కేటాయించిన సబ్జెక్టులపై చర్చలు,నిర్ణయాలు జరిగే సమయంలో సీఎం వద్ద రివ్యూలకు, కేబినెట్ సమావేశానికి సైతం ఆహ్వానిస్తుంటారు. వీరిద్దకి అంతగా ప్రయారిటీ ఇవ్వడం వెనుక పలు రాజకీయ కారణాలు ఉన్నాయి. కేకే బీఆర్ఎస్ ఇచ్చిన రాజ్యసభ ఎంపీ పదవికి రాజీనామా చేసి,కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు ఆయన కుమార్తె హైదరాబాద్ మేయర్ హోదాలో గద్వాల విజయలక్ష్మి సైతం కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు.దీనితో ఆయనకు కేబినెట్ హోదా కల్పించారు. సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి సామాజిక సమీకరణల కారణంగా మంత్రి పదవి ఇవ్వనందకు ప్రత్యామ్నయంగా కేబినెట్ హోదాతో కూడిన సలహాదారుడు పదవి ఇచ్చారు.

నియామకంపై విమర్శలు సైతం

బీఆర్ఎస్ హాయంలో సలహాదారుల నియామకాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టింది. ఇప్పుడు మాత్రం సలహాదారలను దఫా దఫాలుగా నియమిస్తుందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అవసరం ఉన్నా లేకపోయినా వివిధ శాఖలకు అడ్వయిజరీలను నియమిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. సన్నిహితులైన రిటైర్డ్ అధికారులను వివిధ శాఖల్లో సలహాదారులుగా నియమించడం వల్ల ఆశాఖల్లో పనిచేస్తోన్న సీనియర్ అధికారులకు స్వేచ్ఛ లేకుండా పోతుందని, ఇది పరోక్షంగా ఉపాధి పునరావసంగా మారిందని చర్చ జరుగుతున్నది.

# కార్యదర్శులపై సీఎం అగ్రహం

మొదటి పేజీ తరువాయి

సచివాలయంలో జరిగిన సమావేశంలో అజెండా అంశాలు ముగిసిన అనంతరం తాజా పరిణామాలపై మంత్రులతో సీఎం చర్చించారు. 'సమాచారం ఇవ్వలేదా?' అంటూ ప్రశ్న: ఇంధన పొదుపుపై చర్చించేందుకు మొదటి అజెండాగా పెట్టాలని గత రాత్రే సీఎం సీఎస్ కె. విజయానంద్‌కు స్పష్టం చేశారు. అయితే సంబంధిత అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంతో సీఎం అసహనం వ్యక్తం చేశారు. అధికారులు లేకపోవడంతో వారికి 'సమాచారం సరిగ్గా ఇవ్వలేదా?' అని విజయానంద్‌ను ప్రశ్నించారు. సమాచారం ఇచ్చానని విజయానంద్ బదులిచ్చారు.

వివరణ తీసుకుని చర్యలు: సమయపాలన పాటించని అధికారుల తీరుపై సీఎం మండిపడ్డారు. సమయానికి రాని అధికారుల నుంచి వెంటనే వివరణ తీసుకుని సీరియస్ యాక్షన్ తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై జరిగే సమావేశాల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు

# ఏపీ లో పొదుపు బాట

మొదటి పేజీ తరువాయి

మరోవైపు, ఆదాయ వనరులను పెంచుకోవడంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. పన్నుల వసూళ్లలో పారదర్శకత పెంచడం, బకాయిలను వసూలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని మెరుగుపరచాలని యోచిస్తోంది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి, రాష్ట్ర వాటాను సకాలంలో పొందేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

అయితే, ఈ పొదుపు చర్యల ప్రభావం సంక్షేమ పథకాలపై పడకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అర్హులైన పేదలకు అందుతున్న పథకాలు యథావిధిగా కొనసాగుతాయని, కేవలం దుబారాను అరికట్టడమే తమ లక్ష్యమని వివరించింది. పరిపాలనలో డిజిటలైజేషన్ పెంచడం ద్వారా కార్యాలయ ఖర్చులను గణనీయంగా తగ్గించవచ్చని భావిస్తున్నారు.

ఈ పొదుపు నిర్ణయాలను క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాలని కలెక్టర్లకు మరియు శాఖాధిపతులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ సంకల్పానికి ప్రజలు కూడా సహకరించాలని, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడమే తమ ప్రథమ ప్రాధాన్యతని మంత్రిమండలి పేర్కొంది. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో ఈ పొదుపు చర్యల తాలూకు పూర్తి విధివిధానాలను వెల్లడించే అవకాశం ఉంది.

# స్థానిక ఎన్నికలపై జనసేన నజర్

మొదటి పేజీ తరువాయి

స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై కూడా పీఏసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ రెండు కీలక అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇచ్చేందుకు పార్టీ ఇప్పటికే ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ కేడర్‌ను ఎలా సమన్వయం చేయాలో పీఏసీ సభ్యులు చర్చించారు.

కూటమిలోని ఇతర పార్టీలైన టీడీపీ మరియు బీజేపీలతో క్షేత్రస్థాయిలో ఉన్న సమన్వయంపై కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. సీట్ల సర్దుబాటు మరియు ఉమ్మడి ప్రచారం విషయంలో ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా కార్యాచరణ రూపొందించుకోవాలని నేతలు భావిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా ఓటర్ల మద్దతు కూడగట్టాలని నిర్ణయించారు.

గత ఎన్నికల్లో జనసేన సాధించిన విజయ కేతనాన్ని స్థానిక సంస్థల్లో కూడా పునరావృతం చేయాలని, యువత మరియు మహిళా విభాగాలకు ఎన్నికల బాధ్యతల్లో పెద్దపీట వేయాలని సమావేశం తీర్మానించింది. ముఖ్యంగా రాయలసీమ మరియు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పార్టీ బలాన్ని నిరూపించుకోవాలని, అభ్యర్థుల ఎంపికలో స్వచ్ఛమైన మరియు సేవా దృక్పథం ఉన్న నేతలకే ప్రాధాన్యత ఇవ్వాలని పీఏసీ నిర్ణయించింది.

చివరగా, త్వరలోనే పార్టీ శ్రేణులతో ప్రాంతీయ వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించి, ఎన్నికల సమరానికి కార్యకర్తలను సిద్ధం చేయాలని పీఏసీ నిర్ణయించింది. ప్రజల సమస్యల పరిష్కారమే ఎజెండాగా స్థానిక ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు జనసేన నేతలు స్పష్టం చేశారు. ఈ సమావేశంతో జనసేన వర్గాల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

# ఏపీ హైకోర్టు సీజేకు జడ్ ప్లస్ భద్రత..

అమరావతి,ఇది కద నిజం, మే 14: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ లీసా గిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం భద్రతను పెంచింది. ఆమెకు 'జడ్ ప్లస్' కేటగిరీ భద్రత కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ లీసా గిల్‌కు ముప్పు పొంచి ఉందన్న అంచనాలు, సెక్యూరిటీ రివ్యూ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఈ మేరకు తక్షణమే చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆయన విజయవాడ, గుంటూరు పోలీసు కమిషనరేట్ల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. రోజూ విజయవాడలోని తన నివాసం నుంచి అమరావతిలోని హైకోర్టుకు ప్రయాణించే మార్గంలో జస్టిస్ లీసా గిల్ కాన్వాయ్‌కు 'గ్రీన్ ఛానల్' ఏర్పాటు చేయాలని డీజీపీ ఆదేశించారు. దీనివల్ల ఆమె ప్రయాణ సమయంలో కాన్వాయ్ ఎక్కడా ఆగకుండా నేరుగా గమ్యస్థానానికి చేరుకుంటుంది.

జస్టిస్ లీసా గిల్ 2026 ఏప్రిల్ 25న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఏపీ హైకోర్టుకు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించారు..!!

# ఆక్వా రైతుల కష్టాలపై వైఎస్ జగన్ ఆందోళన

మొదటి పేజీ తరువాయి

రైతులకు అండగా ఉండాల్సిన 'రైతు భరోసా కేంద్రాలు' ఇప్పుడు నిర్వీర్యం అయ్యాయని, నాణ్యమైన విత్తనాలు మరియు ఫీడ్ సరఫరాలో పర్యవేక్షణ లోపించిందని జగన్ పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆక్వా జోన్ల పరిధిని పెంచాలని, అలాగే రైతులకు పాత పద్ధతిలోనే విద్యుత్ రాయితీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆక్వా రంగాన్ని కాపాడుకోకపోతే వేలాది కుటుంబాలు వీధిన పడతాయని జగన్ హెచ్చరించారు. రైతుల పక్షాన వైసిపి పోరాటం కొనసాగిస్తుందని, క్షేత్రస్థాయిలో బాధితులను పరామర్శించి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# జీతాలు లేక సెక్యూరిటీ గార్డ్స్ అవస్థలు



రాజమహేంద్రవరం(ఇది కద నిజం) మే 14 : తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డ్స్ గా పనిచేస్తున్న వారికి గత మూడు నెలలుగా జీతాలు లేక అవస్థలు పడుతున్నారని అదేవిధంగా జిల్లా విడిపోయిన తర్వాత ఇదే పెద్ద ఆసుపత్రి కావడంతో రోజుకు 1800 మంది పేషెంట్లు వస్తున్నారని సెక్యూరిటీ సిబ్బంది మాత్రం 60 మంది మాత్రమే ఉన్నారని పెరుగుతున్న రోగుల సంఖ్య కారణంగా సిబ్బందిని 110 మందిని చేయాలని ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు డిమాండ్ చేశారు.

రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రి సెక్యూరిటీ గార్డ్స్ వర్కర్స్ యూనియన్ , ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం ఎం ప్రసాద్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన తాటిపాక మధు మాట్లాడుతూ ప్రతినెల జీతం పడుతున్న పెరుగుతున్న నిత్యవసర వస్తువులు ధరలతో కార్మికులు అవస్థలు పడుతున్నారని అలాంటిది గత మూడు నెలలుగా రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి సెక్యూరిటీ గార్డ్స్ కు జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమని ఆయన అన్నారు అంతేకాకుండా తూర్పుగోదావరి జిల్లా కొత్తగా ఏర్పడడంతో రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి జిల్లా వ్యాప్తంగా రోజుకు 1800 మంది రోగులు వస్తున్నారని కానీ సిబ్బంది మాత్రం తక్కువగా ఉన్నారని కావున సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని ఆయన డిమాండ్ చేశారు అలాగే సెక్యూరిటీ కాంట్రాక్టర్ ఎవరు తెలియని పరిస్థితి ఉందని యూనియన్ నాయకులకు కాంట్రాక్టర్కు సమావేశాన్ని సూపర్డెంట్ నిర్వహించాలని మధు కోరారు..

# కేరళ సీఎంగా వి.డి. సతీశన్

మొదటి పేజీ తరువాయి

ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన సతీశన్, ప్రతిపక్ష నేతగా గత ఐదేళ్లుగా ప్రభుత్వంపై చేసిన పోరాటం ఆయనకు కలిసి వచ్చింది.

ముఖ్యమంత్రి రేసులో సీనియర్ నాయకులు కేసీ వేణుగోపాల్, రమేష్ చెన్నితాల పేర్లు కూడా బలంగా వినిపించాయి. మెజారిటీ ఎమ్మెల్యేలు వేణుగోపాల్ వైపు మొగ్గు చూపినట్లు వార్తలు వచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉన్న ప్రజాభిప్రాయాన్ని మరియు మిత్రపక్షాలైన ముస్లిం లీగ్ మద్దతును పరిగణనలోకి తీసుకున్న అధిష్టానం, సతీశన్ వైపు మొగ్గు చూపింది. ఇది పార్టీలో నూతన నాయకత్వానికి పెద్దపీట వేయడమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

61 ఏళ్ల వి.డి. సతీశన్ ఎర్నాకులం జిల్లాలోని పరవూర్ నియోజకవర్గం నుండి వరుసగా విజయం సాధిస్తూ వస్తున్నారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉన్న ఆయన, న్యాయవాదిగా కూడా సేవలందించారు. సౌమ్యుడిగా, సమర్థుడైన వ్యూహకర్తగా పేరున్న సతీశన్, కూటమిలోని అన్ని పార్టీలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ సందర్భంగా సతీశన్ మాట్లాడుతూ.. ఈ విజయం తన వ్యక్తిగతమైనది కాదని, కేరళ ప్రజల విజయమని పేర్కొన్నారు. వేణుగోపాల్ మరియు చెన్నితాల వంటి సీనియర్ నేతల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటూ, అందరినీ కలుపుకుని 'టీమ్ కేరళ'గా పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం మరియు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు.


అధిష్టానం నిర్ణయంతో కేరళ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. ముఖ్యమంత్రిగా సతీశన్ ప్రమాణ స్వీకారానికి సంబంధించిన ఏర్పాట్లు తిరువనంతపురంలో చురుగ్గా సాగుతున్నాయి. ఈ కొత్త ప్రభుత్వం కేరళ రాజకీయాల్లో ఎలాంటి మార్పులు తీసుకువస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# బండి భగీరథ్ పోక్సో కేసులో ట్విస్ట్..

మొదటి పేజీ తరువాయి

ఇక ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వచ్చే వారానికి వాయిదా వేస్తున్నట్లు కోర్టు ప్రకటించింది. విచారణ సందర్భంగా భగీరథ్ తరపు న్యాయవాది నిరంజన్ రెడ్డి కీలక వాదనలు వినిపించారు. 2021లో డ్రైవింగ్‌లో పట్టుబడిన సమయంలో బాధితురాలి వయసు 15 ఏళ్లుగా ఉందని పేర్కొన్నారు. అయితే పోలీసులు దాఖలు చేసిన ప్రస్తుత చార్జిషీట్‌లోనూ ఆమె వయసు 15 ఏళ్లుగానే పోలీసులు చూపించారని, ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అంతేకాదు.. పోలీసుల చార్జిషీట్‌లో పేర్కొన్న బాధితురాలు పుట్టిన తేదీ, బాధితురాలి పాన్ కార్డులో ఉన్న పుట్టినతేదీ వేరు వేరుగా ఉన్నాయన్నారు. బాధితురాలి వయసు విషయంలో స్పష్టత లేని అంశాలను పరిగణనలోకి తీసుకొని భగీరథ్‌కు బెయిల్ మంజూరు చేయాలని నిరంజన్‌రెడ్డి కోర్టును కోరారు.పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు విన్న హైకోర్టు.. మధ్యంతర బెయిల్ ఇవ్వాలా వద్దా అనే అంశంపై రేపు తన నిర్ణయాన్ని వెల్లడిస్తామని తెలిపింది. అదే సమయంలో ప్రధాన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణను వచ్చేవారం చేపడతామని స్పష్టం చేసింది.


# ఆక్వా ఫీడ్ ధరల పెంపు



అమలాపురం (ఇది కద నిజం ) మే 14 : సాగు ఖర్చులు విపరీతంగా పెరగడంతో పాటు గిట్టుబాటు ధరలు లభించక పోవడం వల్ల రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారని, ఆక్వా రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లా అమలాపురంలో ఆక్వా రైతుల సమస్యల ధాన్యం కొనుగోలు పై రైతులు పడుతున్న ఇబ్బందులపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. అమలాపురం హై స్కూల్ సెంటర్ వద్ద జరిగిన ఈ నిరసనలో పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో

మేత (ఫీడ్) ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమవడంతో టన్నుకు సుమారు రూ.10 వేల వరకు అదనపు భారం పడుతోందనిఆరోపించారు. అదేవిధంగా సిండికేట్ల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, దీనివల్ల సాగు ఖర్చులు పెరిగి రొయ్యల ధరలు తగ్గడంతో రైతులకు నష్టాలు వస్తున్నాయని తెలిపారు.ప్రభుత్వ వైఫల్యాలపై నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని అన్నారు . ముఖ్యంగా యూనిట్‌కు రూ.1.50 పైసలకే విద్యుత్ అందిస్తామని ఇచ్చిన హామీ అమలు కాలేదని చెప్పారు . గత ప్రభుత్వంలో రైతులకు అండగా ఉన్న ఏపీఎస్డిఏ (APSDA) వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు.ఆందోళన అనంతరం నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి ఆక్వా రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# నిత్యాన్నధానంకి విరాళం




నెల్లూరు జిల్లా రాపూరు (ఇది కద నిజం ):- ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన రాపూరు మండలంలోని పెంచలకొన క్షేత్రంలో వెలసియున్న శ్రీ పెనుశీల లక్ష్మీనరసింహస్వామి ఆదిలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నిత్యాన్నధానం పథకం అభివృద్ధికి నెల్లూరు నగరం హౌసింగ్ బోర్డు కాలనీ వ్యాస్తవులు కీ"శే" దేగా కృష్ణారెడ్డి ధర్మపత్ని నాగభూషణమ్మ జ్ఞాపకార్థం కుమార్తె కొత్తూరు ప్రసన్న స్వామి వారి నిత్యాన్నధానం పథకంకి 1,00,116/- అక్షరాల ఒక లక్ష నూట పదహార్లు రూపాయలు నగదు రూపంలో దేవస్థానం సిబ్బందికి అందజేశారు. అనంతరం వారికి దేవస్థానం శిబ్బంది ఆలయ మర్యాదలతో శ్రీవార్ల దర్శనం స్వామివార్ల శేష వస్త్రములు మరియు ప్రసాదం అందజేశారు.

# ప్రమాద రహితంగా భోగాపురం విమానాశ్రయం



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని పూర్తి ప్రమాద రహితంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పక్షులు మరియు వన్యప్రాణుల ద్వారా ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా అన్నిరకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రెండవ ఏరోడ్రోమ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం ఎయిర్‌పోర్ట్ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ విమానయాన భద్రతా ప్రమాణాల ప్రకారం విమానం టేకాఫ్ మరియు ల్యాండింగ్ సమయంలో ఎటువంటి విఘాతం కలగకుండా ఉండటమే ఈ కమిటీ ప్రాథమిక లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రకృతికి అనుకూలమైన, సురక్షితమైన మరియు సుస్థిరమైన విమానాశ్రయ వాతావరణాన్ని కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. విమానాశ్రయం చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో పక్షులు, కుక్కలు లేదా ఇతర వన్యప్రాణులు రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. పక్షులు విమానం ఇంజిన్‌లోకి వెళ్లడం వల్ల జరిగే భారీ ప్రమాదాలను నివారించేందుకు ఈ ప్రాంతాన్ని 'బర్డ్ స్ట్రైక్ ఫ్రీ జోన్'గా మార్చాలని ఆదేశించారు. విమానాశ్రయ పరిసరాల్లో మాంసం దుకాణాలు, బహిరంగ వ్యర్థాలు ఉండటం వల్ల పక్షులు ఆహారం కోసం వస్తుంటాయని, అందుకే చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేసేయకుండా,సమగ్ర చెత్త నిర్వహణా వ్యవస్థలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితి సంతృప్తికరంగా ఉందని, భవిష్యత్తో పక్షులు, వన్య ప్రాణులు వల్ల ముప్పు పెరగకుండా చూడాలని కోరారు. దీనికోసం విమానాశ్రయ నిర్వహణ సంస్థ మరియు స్థానిక పరిపాలన యంత్రాంగం మధ్య నిరంతర సమన్వయం ఉండాలని, ఈ మేరకు విమానాశ్రయ సమీపంలోని ఈఓపిఆర్డీలకు, ఎంపీడీవోలకు, పంచాయతీ కార్యదర్శులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు.అన్ని రకాల భద్రతా చర్యలు పాటించాలంటే ప్రజల సంపూర్ణ సహకారం అవసరమని కలెక్టర్ స్పష్టం చేశారు. అందువల్ల విమానాశ్రయ సమీపంలోని సుమారు 21 గ్రామాల్లో నివసించే ప్రజలకు పారిశుధ్యం, నిబంధనలు, విమాన ప్రయాణ భద్రత పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. వెంటనే అవగాహనా కార్యక్రమాలను మొదలుపెట్టాలని ఆదేశించారు. అనంతరం విమానాశ్రయ నిర్మాణ ప్రగతిని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సమీక్షించారు.

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 15-05-2026

# అన్నదాతకు అండగా జిల్లా యంత్రాంగం:మక్కల కొనుగోలులో వేగం

**ఇది కద నిజం న్యూస్ భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొక్కజొన్న (మక్కల) కొనుగోలు ప్రక్రియ ఇటీవలి కాలంలో గణనీయమైన వేగం పుంజుకుంది.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మరియు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక చొరవతో రైతులు ఎదుర్కొంటున్న మార్కెటింగ్, నిల్వ సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారాలు లభించాయి.యాసంగి సీజన్‌లో జిల్లాలో 49,528 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరగగా,సుమారు 1.31 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేయబడింది.ఈ భారీ ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రైతులకు దక్కేలా జిల్లా యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టింది.జిల్లాలో 45 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించగా, 12 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 21,641 మెట్రిక్ టన్నుల మక్కలను సేకరించారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు,తార్పాలిన్లు,కాంటా యంత్రాలు వంటి కనీస సౌకర్యాలను కల్పించారు.నిల్వ సమస్యను అధిగమించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు క్షేత్రస్థాయిలో ప్రణాళికలు రూపొందించారు.జిల్లాలో ఉన్న 30,150 మెట్రిక్ టన్నుల గోదాముల సామర్థ్యంతో పాటు,అదనంగా ఇతర జిల్లాల్లో 7,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను,జిల్లాలోని రెండు జిన్నింగ్ మిల్లులను నిల్వ కేంద్రాలుగా అందుబాటులోకి తెచ్చారు.హమాలీల కొరతను నివారించేందుకు ప్రభుత్వం కూలి రేటును బ్యాగ్‌కు రూ. 6.50 నుండి రూ. 8.50కు పెంచడం ద్వారా కార్మికులను ప్రోత్సహించింది.దీనివల్ల ప్రతిరోజూ 600 నుండి 800 మెట్రిక్ టన్నుల వరకు అన్‌లోడింగ్ జరుగుతూ కొనుగోళ్ల వేగం పెరిగింది.ఎమ్మెల్యే,కలెక్టర్ స్వయంగా కొనుగోలు కేంద్రాలను సందర్శిస్తూ,రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు.పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారు.ప్రభుత్వ మద్దతు ధరతో పాటు జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న ఈ సమగ్ర చర్యల వల్ల మక్క రైతులకు ఆర్థిక భరోసా లభించింది.తమ పంటను నష్టపోకుండా విక్రయించుకునే పరిస్థితులు మెరుగుపడటం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల సమన్వయం ,ప్రజాప్రతినిధుల పర్యవేక్షణతో జిల్లాలో మక్కల కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోంది.





# హన్మకొండ: నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని దంపతులు

హన్మకొండ, ఇది కద నిజం న్యూస్ మే 14: అయినవోలు మండలంలో జరిగిన రెండు వివాహ వేడుకల్లో మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు-మధుమతి దంపతులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



తాటికొండ కొమురెల్ల కృష్ణయ్య కుమార్తె వివాహం

నందనం రెడ్డిపాలెంలోని ఫాక్స్ హాల్‌లో జరిగిన తాటికొండ కొమురెల్ల కృష్ణయ్య కనిష్ట పుత్రిక కవిత - ప్రశాంత్ వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. దొంతూరి రాజు గౌడ్ - అర్చన వివాహం

శ్రీ అయినవోలు మల్లికార్జున గార్డెన్‌లో జరిగిన దొంతూరి విజయ, కీ.శే. సమ్మయ్యల పుత్రుడు రాజు గౌడ్ - అర్చన వివాహంలో పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.దశదిన కర్మలో పాల్గొని నివాళి అనంతరం ఇటీవల ఐనవోలు గ్రామంలో మరణించిన గడ్డం భాగ్యమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో మార్నేని రవీందర్ రావు పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బరిగెల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




# దొంతురి రాజు - అర్చన వివాహ వేడుకలో బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి



**ఇది కద నిజం న్యూస్ ఐనవోలు/మే 14**

హన్మకొండ జిల్లా:ఐనవోలు: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త దొంతురి రాజు - అర్చన వివాహ మహోత్సవంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు."శతమానం భవతి" అంటూ నూతన దంపతులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు గడ్డం రఘువంశీ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ అడ్డగూడి సతీష్, మాజీ పిఏసిఎస్ చైర్మన్ తండ వెంకన్న, మాజీ డైరెక్టర్ రాజిరెడ్డి, మాజీ వార్డు సభ్యుడు కొత్తూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

## 16 రకాల పరీక్షల కోసం 'హెల్త్ క్యూబ్' కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జీఎస్సార్




**ఇది కద నిజం న్యూస్ భూపాలపల్లి**

ప్రజలకు నాణ్యమైన,తక్షణ వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.గురువారం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) కార్యాలయంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన జిల్లా వ్యాప్తంగా 50 'హెల్త్ క్యూబ్ డయాగ్నస్టిక్ డివైసెస్' కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీడీఎల్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధుల ద్వారా సమకూర్చిన ఈ కిట్ల ద్వారా ఒకే చోట 16 రకాల వైద్య పరీక్షలు నిర్వహించవచ్చని పేర్కొన్నారు.వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు తక్షణమే రోగ నిర్ధారణ చేసి, ప్రాణాపాయం కలగకుండా సకాలంలో చికిత్స అందించడానికి వీలవుతుందని ఆయన వివరించారు.అలాగే సీఎస్ఆర్ నిధులతో ప్రధాన ఆసుపత్రిలో వెంటిలేటర్లు,ఎంఆర్ఐ,సీటీ స్కాన్ వంటి అత్యాధునిక యంత్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా,అవసరమైన సాంకేతిక నిపుణులను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.జిల్లా ప్రధాన ఆసుపత్రిని రూ.14 కోట్ల వ్యయంతో 200 పడకల స్థాయికి అభివృద్ధి చేస్తున్నామని,ఆసుపత్రి నిర్వహణ కోసం కొత్తగా 203 పోస్టులను మంజూరు చేయించినట్లు వెల్లడించారు.పల్లె దవాఖానాల ద్వారా వైద్య సేవలను ప్రజల ముంగిటకే చేరువ చేస్తామని,అసంపూర్తిగా ఉన్న భవనాలను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి సబ్ సెంటర్‌లో ఈ హెల్త్ క్యూబ్ పరికరాలను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.గతంలో పరీక్షల కోసం నమూనాలను జిల్లా కేంద్రంలోని 'టీ-హబ్'కు పంపాల్సి వచ్చేదని,ఇప్పుడు ఈ పరికరాల ద్వారా అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించి వెంటనే ఫలితాలు పొందే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు.దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా రోగికి వేగంగా వైద్యం అందుతుందని ఆయన స్పష్టం చేశారు.ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్,మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య,మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్,వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు,ఏఎన్ఎంలు,ఎంఎల్ హెచ్ పిలు పాల్గొన్నారు.వైద్యాధికారులు,సిబ్బంది అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.




# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి



వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం తూర్పుతండ గ్రామానికి చెందిన బానోతు మోహన్ కూతురు చి.సంగీత-సంతోష్ వివాహ మహోత్సవ వేడుకలో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్,మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మాజీ జీహెచ్ఎంసీ కార్పొరేటర్ చింతల యాదగిరి,మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు తక్కళ్లపెల్లి భాస్కర్ రావు, మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, మాజీ ఎనుమాముల మార్కెట్ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్ రెడ్డి, మాజీ ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం గౌడ్, పర్వతగిరి సొసైటీ చైర్మన్ మనోజ్ గౌడ్, మాజీ ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్ రావు, సోమారం సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్,ఏనుగల్ గ్రామ అధ్యక్షుడు మాసాని వెంకట్, మాజీ చౌటపల్లి పిఏసిఎస్ చైర్మన్ గంధం బాలరాజు, ఏనుగల్లు మాజీ ఉప సర్పంచ్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

**ఇది కద నిజం న్యూస్ పర్వతగిరి/మే 14**



వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం తూర్పుతండ గ్రామానికి చెందిన బానోతు మోహన్ కూతురు చి.సంగీత-సంతోష్ వివాహ మహోత్సవ వేడుకలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు తక్కళ్లపెల్లి భాస్కర్ రావు, మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, మాజీ ఎనుమాముల మార్కెట్ వైస్ చైర్మన్ ఏడుదొడ్ల జితేందర్ రెడ్డి, మాజీ ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం గౌడ్, పర్వతగిరి సొసైటీ చైర్మన్ మనోజ్ గౌడ్, మాజీ ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ బోయినపల్లి యుగంధర్ రావు, సోమారం సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్, బొట్ల మధు, ఏనుగల్ గ్రామ అధ్యక్షుడు మాసాని వెంకట్, మాజీ చౌటపల్లి పిఏసిఎస్ చైర్మన్ గంధం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

## : ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ఇది కద నిజం న్యూస్ భూపాలపల్లి**

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే తమ గృహ నిర్మాణ పనులను ప్రారంభించేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి గృహ నిర్మాణ శాఖ,మున్సిపల్ అధికారులు,ఎంపీడీవోలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎటువంటి ఇసుక కొరత లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే ఇళ్లు మంజూరై,ఇంతవరకు పనులు ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించి,వారిలో అవగాహన కల్పించి వెంటనే నిర్మాణాలు మొదలుపెట్టేలా చూడాలని స్పష్టం చేశారు.జూన్ 2వ తేదీన భారీ ఎత్తున 'మాస్ గృహప్రవేశాలు' నిర్వహించాల్సి ఉన్నందున,ఆ లోపు నిర్మాణంలో ఉన్న ఇళ్లను పూర్తి చేసేలా గృహ నిర్మాణ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు.గృహ నిర్మాణ శాఖకు చెల్లించాల్సిన ఉపాధి హామీ పథకం నిధులను ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన మంజూరు చేయాలని డీఆర్‌డీఓ అధికారులను ఆదేశించారు.ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రాధాన్యత ఇస్తోందని,అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ పథకాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య,మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్,గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీకాంత్,వివిధ మండలాల ఎంపీడీవోలు,గృహ నిర్మాణ శాఖ ఏఈలు,డీఈలు పాల్గొన్నారు.ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గృహ నిర్మాణాల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా వెల్లడించారు.

# బల్క్ ల్యాండ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

## :ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు


**ఇది కద నిజం న్యూస్ భూపాలపల్లి**



నియోజకవర్గ పరిధిలో ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న బల్క్ ల్యాండ్ సమస్యలను పరిష్కరించి, అర్హులైన రైతులకు పట్టాలు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి రెవెన్యూ,సర్వే,అటవీ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుంటున్నప్పటికీ,పట్టాలు లేక ఇబ్బంది పడుతున్న రైతులకు పట్టాలు మంజూరు చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు.అర్హులైన రైతులకు భూ హక్కులు కల్పించడం ద్వారా వారికి సామాజికంగా,ఆర్థికంగా భద్రత లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.ఇందుకోసం రెవెన్యూ,అటవీ,సర్వే శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని,అర్హుల వివరాలతో కూడిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. బల్క్ ల్యాండ్ సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేయాలని,ఎక్కడా అవకతవకలకు తావులేకుండా అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో తహసీల్దార్లు వ్యక్తిగత పర్యవేక్షణ చేసి నివేదికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్ఓ వసంత కుమారి,ఆర్డీఓ హరికృష్ణ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి,డీఎఫ్ఓ అప్పలకొండ,అలాగే భూపాలపల్లి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్లు,ఇతర అధికారులు పాల్గొన్నారు.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో భూ సమస్యలతో సతమతమవుతున్న వేలాది మంది రైతులకు ఊరట లభించనుంది.




# దర్శకుడుగా హీరో రామ్.. నేడు అధికారిక ప్రకటన.!



తెలుగు సినీ పరిశ్రమలో ఎనర్జిటిక్ స్టార్‌గా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రామ్ పోతినేని ఇప్పుడు దర్శకుడిగా కొత్త ప్రయాణం ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. హీరోగా నటిస్తున్న తన 23వ చిత్రాన్ని స్వయంగా తెరకెక్కించాలని రామ్ నిర్ణయించుకున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో తన కోసం తానే ఓ పవర్‌ఫుల్ కథను సిద్ధం చేసుకున్న రామ్, ఆ కథలోని భావోద్వేగాలను తాను ఊహించిన విధంగా చూపించగల దర్శకుడు దొరకకపోవడంతో చివరకు మెగాఫోన్ పట్టాలని నిర్ణయించుకున్నారట. ప్రస్తుతం ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి సంబంధించిన ప్రీ–ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. ‘ఖైదీ’, ‘విక్రమ్ వేద’ ఫేమ్ సామ్ సి.ఎస్. ఈ చిత్రానికి సంగీతం అందించనుండగా, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని సమాచారం. నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక పూర్తయ్యాక త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. రామ్ దర్శకుడిగా మారుతున్న ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

# ‘పెద్ది’ వేడుకలు రెండు!



చాలా రోజులుగా స్తబ్దుగా ఉన్న తెలుగు చిత్రసీమలో సందడి మొదలవుతోంది. ‘పెద్ది’ సినిమా విడుదలకు సమయం దగ్గర పడుతుండటమే అందుకు కారణం. వచ్చే నెల 4న ఈ చిత్రం రానున్న సంగతి తెలిసిందే. దీంతో ప్రచార కార్యక్రమాలకు రంగం సిద్ధమైంది. ఈ నెల 18న ముంబయిలో ట్రైలర్ ఆవిష్కరణ వేడుకని నిర్వహించనున్నట్టు తెలిపింది చిత్రబృందం. 23న భోపాల్‌లో ప్రత్యేక గీతం ఆవిష్కరణతోపాటు, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆధ్వర్యంలో ‘సౌండ్ ఆఫ్ పెద్ది’ పేరుతో సంగీత ప్రదర్శనని నిర్వహిస్తున్నట్టు సినీ వర్గాలు స్పష్టం చేశాయి. రామ్‌చరణ్ కథానాయకుడిగా... బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. జాన్వీ కపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని చేసుకుంటోన్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే అమెరికాలో ముందస్తు టికెట్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో జరుగుతున్నట్టు సినీ వర్గాలు స్పష్టం చేశాయి. జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి. శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఆర్.రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్: అవినాశ్ కొల్లా, కూర్పు: నవీన్ నూలి, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్.

# జాసన్ విజయ్ కు సీఎం విజయ్ సపోర్ట్ ఉంటుందా..

## సందీప్ కిషన్ తో సినిమా ఏమైంది?




స్టార్ కిడ్స్ ఇప్పుడు కేవలం నటనకే పరిమితం కాకుండా దర్శకత్వంలోనూ తమ ప్రతిభను చాటుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఇప్పటికే ఆర్యన్ ఖాన్ , దియా సూర్య వంటి స్టార్ కిడ్స్ మెగాఫోన్ పట్టి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇదే జాబితాలో ఇప్పుడు జాసన్ సంజయ్ పేరు కూడా హాట్ టాపిక్‌గా మారింది. దళపతి విజయ్ తనయుడు జేసన్ సంజయ్, ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ‘సిగ్మా’ చిత్రంతో దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఈ సినిమాలో సందీప్ కిషన్ హీరోగా నటిస్తుండగా, షూటింగ్ కూడా వేగంగా సాగుతున్నట్లు సమాచారం.అయితే, ఈ ప్రాజెక్ట్‌పై ఇటీవల పలు ఊహాగానాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. జేసన్ సంజయ్ తన తండ్రి విజయ్‌ను సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేయడం కోలీవుడ్‌లో చర్చనీయాంశమైంది. విజయ్ వ్యక్తిగత నిర్ణయాల కారణంగానే తండ్రీకొడుకుల మధ్య దూరం పెరిగిందన్న ప్రచారం జరుగుతోంది. దీంతో జేసన్ తన కెరీర్‌ను తండ్రి సపోర్ట్ లేకుండానే నిర్మించుకోబోతున్నాడా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ వార్తలపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేకపోవడంతో, ఇవన్నీ కేవలం వదంతులేనా అన్నది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం మాత్రం జేసన్ తొలి దర్శకత్వ చిత్రం ‘సిగ్మా’పై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.



# ఇష్టపడకపోతే.. మరింత కష్టపడతా!

నాతో మంచి స్నేహం కుదరాలంటే కనీసం నాలుగుసార్లు అయినా కలిసి మాట్లాడాలి అంటోంది బాలీవుడ్ హీరోయిన్ సారా అలీఖాన్. అంతేకాదు కెరీర్‌లో నెగిటివిటీని పట్టించుకోకుండా.. ప్రేక్షకులు ఆదరించే వరకు కష్టపడతానని చెప్పుకొచ్చింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సారా మాట్లాడుతూ.. “మీరు నన్ను రెండు, మూడు సార్లు కలిసినప్పుడు నేను మీకు నచ్చకపోవచ్చు. కానీ, మనం నాలుగోసారి కలిస్తే కచ్చితంగా స్నేహితులవుతాం. నా జీవితంలోనే ఒక ఫిల్టర్ సిస్టమ్ ఉన్నట్లుంది. అందుకేనేమో నేను మీకు నచ్చాలంటే నాలుగుసార్లు అయినా కలవాలి. నా కెరీర్ ప్రారంభంలోనే ప్రేక్షకుల నుంచి చాలా ప్రేమ లభించింది. ‘కేదార్‌నాథ్’, ‘సింబా’ విడుదల తర్వాత రాత్రికి రాత్రే ఫేమ్ సాధించడంతో తొలినాళ్లలోనే అమ్మ జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. నేను కూడా నిజాయతీతో పనిచేస్తే ప్రేక్షకులు ప్రేమతో ఆదరిస్తారని అప్పుడే తెలుసుకున్నా. అంతా మంచే జరగాలని ఆశిస్తూ ముందుకు సాగిపోవాలనుకున్నా. నెగిటివిటీని అస్సలు పట్టించుకోను. నా దృష్టిలో ఎలాంటి నెగిటివిటీ ఎదురైనా చివరికి పనే మాట్లాడుతుందని భావిస్తాను. ఒకవేళ ప్రేక్షకులు నన్ను ఇష్టపడకపోతే మరింత కష్టపడతాన”ని అంది. ‘పతి పత్నీ ఔర్ వోదో’ చిత్రంతో ఈ నెల 15 నుంచి థియేటర్లలో సందడి చేయనుంది సారా.



# వాళ్లందరూ మనింట్లో అద్దాలు లేవనుకుంటారేమో

సినీ పరిశ్రమలోని నటీమణుల వయసుపై సమాజం అనవసరంగా ఎక్కువ దృష్టిపెడుతోందని ప్రముఖ నటి టబు అన్నారు. మహిళలు సాధిస్తోన్న విజయాల కంటే ఏజ్ గురించే ఎక్కువగా మాట్లాడుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. వయసు పెరుగుతున్న విషయాన్ని ఎలాంటి మొహమాటం లేకుండా అమ్మాయిలు అంగీకరిస్తుంటే.. బయట ప్రపంచం మాత్రం దాని గురించి ఎక్కువగా చర్చిస్తోందన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయంపై స్పందించారు.

“మీ వయసుపై మీకన్నా ఇతరులకే ఎక్కువ ఆందోళన ఉంటుంది. ఇంట్లో అద్దం లేనట్లుగా వచ్చి మీకు చూపించాలని చూస్తారు. వయసు పెరగడం ఒక్క రోజులో జరిగే మార్పు కాదని మనకు అర్థం అవుతూనే ఉంటుంది. ఈరోజు 20 ఏళ్ల వయసులో నిద్రపోతే రేపటికి అది 45 ఏళ్ల వయసుకు చేరదు కదా” అని అన్నారు. ముఖ్యంగా సినీ రంగంలో హీరోయిన్‌ల వయసుపై అధిక విమర్శలు రావడం బాధాకరమని టబు అభిప్రాయపడ్డారు.

ఇక సినిమాలను తిరస్కరించే విషయంలో కూడా తాను ఎప్పుడూ నిజాయతీగా ఉంటానని టబు తెలిపారు. “సినిమా చేయకూడదనుకుంటే అసలు కారణం చెప్పొద్దు. డేట్స్ లేవని చెప్పి వెళ్లిపోమని చాలామంది నాకు సలహా ఇచ్చారు. కానీ నాకు స్క్రిప్ట్ నచ్చకపోతే నచ్చలేదనే చెప్పేస్తా” అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె నటించిన ‘భూత్ బంగ్లా’ ఆదరణ సొంతం చేసుకుంటోంది. విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ‘స్లమ్ డాగ్’లో టబు నటిస్తున్నారు. దీనితో పాటు నాగార్జున 100వ చిత్రంలోనూ ఆమె కీలక పాత్రలో కనిపించనున్నారు.